క్లుప్తంగా

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



ఐకేపీ కార్యాలయంలో అవగాహన కల్పిస్తున్న పద్మభూషణ్ రాజు

నార్నూర్: మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా ఎదగాలంటే స్వయం ఉపాధి అవకాశాలు కలిగి ఉండాలని ఇండస్ట్రియల్ జనరల్ మేనేజర్ పద్మభూషణ్ రాజు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందన్నారు. పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఈ, విశ్వకర్మ వంటి పథకాల ద్వారా మహిళలు యూనిట్లు ఎంచుకొని స్వయం ఉపాధి అవకాశాలు పొందవచ్చన్నారు. ఎల్డీఎం ఉత్పల్, ఈవీఎం రవి, సీహెచ్‌సీ జిల్లా మేనేజర్ రాహుల్, నీతి అయోగ్ ఇన్‌చార్జి రాహుల్, ఏపీఎం రమేశ్, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

వేగవంతంగా వార్డు ఓటర్ లిస్ట్ నమోదు కార్యక్రమం

నార్నూర్: స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వచ్చే నెల 6న అన్ని గ్రామపంచాయతీ కార్యాలయాల్లో వార్డుల వారీగా ఓటర్‌లిస్టును విడుదల చేయనున్నట్లు ఎంపీవో స్వప్నశీల తెలిపారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో వార్డుల వారీగా ఓటర్ లిస్ట్‌పై పంచాయతీ కార్యదర్శులతో కలిసి మార్కింగ్ చేసే ప్రక్రియ పరిశీలించారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ఘనంగా అన్నాభావు సాఠె జయంతి

నార్నూర్: నవల రచయిత, రాజకీయ నేత, ప్రముఖ సంఘసంస్కర్త అన్నాభావు సాఠె 104వ జయంతిని మంగళవారం మండలంలోని సోనాపూర్ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. అన్నాభావు సాఠె చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించిన అనంతరం జెండా ఆవిష్కరించారు. ప్రముఖ రచయిత రాథోడ్ శ్రావణ్, మాజీ సర్పంచ్ జాదవ్ సుజాత పరమేశ్వర్, జాదవ్ సోహన్ సింగ్, వసంత్ సింగ్, కారోబారి జాదవ్ పరశురాం, అంబారావు, మెర్సింగ్, తానాజీ, శ్రీనివాస్, బాయి, దివ్యరాణి ఉన్నారు.

కోతులు, కుక్కల బెడద నుంచి రక్షించండి

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ప్రజలకు పశువులు, కోతులు, కుక్కల బెడద నుంచి రక్షణ కల్పించాలని మంగళవారం ఎమ్మార్పీఎస్ నాయకులు ఎంపీడీవో లక్ష్మణ్‌కు వినతిపత్రం అందజేశారు. రోడ్లపై పశువులు సంచరిస్తుండడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. పలు కాలనీల్లో కుక్కలు చిన్న పిల్లలపై దాడులు చేస్తున్నాయని పేర్కొన్నారు. నాయకులు సుభాష్, భూమయ్య, రవి, గంగయ్య, రాజు, ఆరేపల్లి రవి, శ్రీను, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఏకలవ్య ఫౌండేషన్ సభ్యుడు దిగంబర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నం.2లో స్మార్ట్‌ల్యాబ్‌ను ప్రారంభించారు. ఆ సంస్థ ద్వారా 5 కంప్యూటర్లు, ఐదు టేబుళ్లు, పది కుర్చీలు అందజేశారు. ప్రాజెక్ట్ మేనేజర్ ప్రశాంత్, ప్రధానోపాధ్యాయుడు సుధాకర్, ఉపాధ్యాయులు మహేందర్ రెడ్డి, శైలేందర్, భూపతి, సుచరిత, సంధ్యారాణి, సతీశ్, హరీశ్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశం.. అధికారుల అమలు



రన్నింగ్ ట్రాక్ వద్ద ఏర్పాటు చేసిన సూచిక బోర్డు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో 400 మీటర్ల రన్నింగ్ ట్రాక్‌పై సాధన చేయడానికి స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులు ఇబ్బంది పడుతున్న విషయాన్ని ఇటీవల కలెక్టర్ రాజర్షిషా దృష్టికి విద్యార్థులు తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టర్ విద్యార్థుల సాధన సమయంలో రన్నింగ్ ట్రాక్‌పై నడక సాధన చేయకూడదని, సైన్ బోర్డ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో డీఎస్ఏ అధికారులు రన్నింగ్ ట్రాక్ వద్ద సూచిక బోర్డు ఏర్పాటు చేశారు.

ఏజెన్సీ బంద్ ప్రశాంతం

- ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలని బంద్‌కు పిలుపు

ఉట్నూర్‌రూరల్: తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఇచ్చిన బంద్ మండల కేంద్రంలో విజయవంతమైంది. ప్రభుత్వ, ప్రైవేటు, దుకాణ సముదాయాలు సంపూర్ణంగా బంద్ పాటించాయి. ఉట్నూర్ ఎక్స్‌రోడ్డు నుంచి ఉట్నూర్ ఐబీ మీదుగా ఐటీడీఏ వరకు ఆదివాసీ సంఘాలు, ఆదివాసీలు ర్యాలీగా తరలివచ్చి ఐటీడీఏ ఎదుట బైఠాయించారు. ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఎదుట గోడు వెల్లబోసుకున్నారు. తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్క బాపురావు లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఐటీడీఏ పీవోకు వినతిపత్రం సమర్పించారు. స్పందించిన పీవో సమస్యలను గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. సార్మెడి నైత్రం చిత్రు, మాజీ ఎంపీపీ జైవంత్‌రావు, సోనేరావు, జంగు, త్రిమూర్తి పెందూర్, ప్రభాకర్, మెస్రం మానిక్‌రావు, గేడం భారత్, పుర్కచిత్రు, కోట్నాక్ బారిక్‌రావు, సోయం రాందాస్, కాత్లే పృథ్వీరాజ్, ఆత్రం తిరుపతి, కుడిమెత తిరుపతి పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: ఆదివాసీల న్యాయమైన హక్కుల సాధన కోసం మంగళవారం నిర్వహించిన బంద్ విజయవంతమైంది. ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ నాయకులు ఉదయం మార్కెట్‌లో మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించి మార్కెట్, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలను బంద్ చేశారు. ఇంద్రవెల్లిలోని గ్రామాల్లో పర్యటనకు వెళ్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు ఆదివాసీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఆదివాసీ 9 తెగల సమన్వయ కర్త కొట్నాక్ భారిక్‌రావు, తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు గేడం భారత్, డివిజన్ ఉపాధ్యక్షుడు పుర్క హనుమంత్‌రావు, నాయకులు జుగ్నాక్ భారత్, పృథ్వీరాజ్, సోయం వినోద్, మెస్రం జైరాం, కుమ్ర భీంరావు, ముకుంద్ తదితరులు ఉన్నారు.



ఉట్నూర్‌రూరల్: ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీలు

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతోపాటు ఏజెన్సీ డీఎస్సీ నోటిఫికేషన్, జీవో నంబర్ 3ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ గిరిజన సంఘాలు ఇచ్చిన ఏజెన్సీ బంద్ మంగళవారం నార్నూర్, గాదిగూడ మండలాల్లో ప్రశాంతంగా జరిగింది. నార్నూర్ మండల కేంద్రంలోని గాంధీచౌక్ వద్ద ఆదివాసీ సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. గాదిగూడ మండలంలోని లోకారి కే గ్రామంలోని కుమురం భీమ్ చౌక్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. నాయకులు పెందూర్ దీపక్, ఊర్వేత రూప్‌దేవ్, తొడసం నాగోరావ్, అర్కా గోవింద్ తదితరులు ఉన్నారు.

బజార్‌హత్నూర్: ఏజెన్సీ ప్రాంత సమస్యలు పరిష్కరించాలని, ఆదివాసీ గిరిజనుల హక్కులను పరిరక్షించాలని ఆదివాసీ గిరిజన సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం మండల కేంద్రంలో వ్యాపారులు తమ వ్యాపార సముదాయాలను స్వచ్ఛందంగా మూసిఉంచి బంద్‌కు సహకరించారు. కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జల్కే పాండురంగ్, రమేశ్, సుదర్శన్, సందీప్, ఉత్తం, మహేశ్ పాల్గొన్నారు.

ఇచ్చోడ: ఏజెన్సీ చట్టాలను పాలకులు పకడ్బందీగా అమలు చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి కొడప నగేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఏజెన్సీ బంద్ సందర్భంగా మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించి మాట్లాడారు. ఏజెన్సీలో చట్టాలు పకడ్బందీగా అమలు చేయకపోవడంతో ఆదివాసీలు అన్ని రంగాల్లో వెనకబడిపోతున్నారన్నారు. జీవో నంబర్ 3ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో నిర్వహించిన బంద్ విజయవంతమైంది. తుడుందెబ్బ నాయకులు ఆత్రం మహేందర్, సిడాం మురళి, జంగు, వెంకటేశ్, భీముడు తదితరులు పాల్గొన్నారు.

తలమడుగు: పెండింగ్‌లో ఉన్న ఆదివాసీ గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తుడుందెబ్బ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మంగళవారం నిర్వహించిన ఏజెన్సీ బంద్ మండలంలో విజయవంతమైంది. తుడుందెబ్బ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలను బంద్ చేయించారు. తుడుందెబ్బ డివిజన్ అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, మండల అధ్యక్షుడు జంగాల పోచన్న, మాజీ అధ్యక్షుడు భుజంగరావు, కృష్ణ పటేల్, ధర్మ పటేల్, రాంజీ తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన పట్టణ బంద్ సంపూర్ణమైంది. తుడుందెబ్బ నాయకులు ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లి ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా తిరుగుతూ బంద్‌కు సహకరించాలని వ్యాపారులను కోరారు. అనంతరం ఆదిబాద్‌రూరల్ మండలంలోని ఏజెన్సీ గ్రామాల్లో తిరుగుతూ దుకాణాలు మూయించారు. ఆదివాసీ హక్కుల పోరాట సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు గోడం గణేశ్, తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉయికే సంజీవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మనోజ్, మహిళ సంఘం జిల్లా అధ్యక్షురాలు రేణుక, జిల్లా ఉపాధ్యక్షురాలు ఇందిరా, డివిజన్ అధ్యక్షుడు ప్రకాశ్, రైతు సంఘం డివిజన్ అధ్యక్షుడు భుజంగ్‌రావ్, మెస్రం తులసీరాం తదితరులు పాల్గొన్నారు.

బంద్ పాక్షికం

గుడిహత్నూర్: ఏజెన్సీ బంద్ మండల కేంద్రంలో పాక్షికంగా జరిగింది. ఉదయం బంద్ పాటించిన వ్యాపారస్తులు ఆ తర్వాత తమ వ్యాపారాలు కొనసాగించారు.



నార్నూర్: గాదిగూడ మండలం లోకారి కేలో నిరసన తెలుపుతున్న గిరిజనులు



తలమడుగు: బంద్ నిర్వహిస్తున్న నాయకులు



ఆదిలాబాద్‌రూరల్: నిరసన తెలుపుతున్న తుడుందెబ్బ నాయకులు



బజార్‌హత్నూర్‌లో..



ఉట్నూర్‌రూరల్: పీవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



ఇంద్రవెల్లి: ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



ఇచ్చోడ: రాస్తారోకో చేస్తున్న తుడుందెబ్బ నాయకులు

చిన్నారులను అన్ని విధాలుగా ఆదుకుంటాం

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



పిల్లల ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

ఇంద్రవెల్లి: తల్లిని కోల్పోయిన చిన్నారులను ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఇటీవల మండలంలోని అందునాయక్ తండా గ్రామానికి చెందిన వాగ్మారే దీక్ష ఇటీవల ఇద్దరు కవల పిల్లలకు జన్మనిచ్చి గుండెపోటుతో మృతి చెందగా, విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మంగళవారం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి పిల్లల ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. బాలల సంరక్షణ అధికారులతో మాట్లాడి చిన్నారుల స్థితిగతులను వివరించారు. అనంతరం రూ.20 వేలు ఆర్థికసాయం అందజేశారు. తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, నాయకులు ఎండీ మసుద్, మెస్రం నాగ్‌నాథ్, నాగోరావ్, కొమురయ్య తదితరులు ఉన్నారు.

ప్రభుత్వం తరపున పిటిషన్ దాఖలు చేయాలని వినతి

ఉట్నూర్‌రూరల్: ఇటీవల ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే కోరుతూ తెలంగాణ ప్రభుత్వం తరపున పిటిషన్ దాఖలు చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు మాల మహానాడు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. సమితి రాష్ట్ర కార్యదర్శి రమేశ్, మండల ప్రధాన కార్యదర్శి ఆవన్న, నర్సయ్య, సుశీల్‌కుమార్, మధు, కనక రావు, దేవానందం, రమేశ్, రాములు ఉన్నారు. కాగా మండలంలోని నర్సాపూర్ –బి పంచాయతీ పరిధిలోని పెందూర్‌గూడ గ్రామంలో రూ.15 లక్షల నిధులతో రాయిసెంటర్ భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు భూమిపూజ చేశారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీకి సన్మానం

ఆదిలాబాద్‌రూరల్: ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన మనోహర్ రావును చర్మకారుల సంక్షేమ సంఘం నాయకులు మంగళవారం ఆయన ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సత్కరించారు. ఉపాధ్యక్షులు అంజయ్య, ప్రధాన కార్యదర్శి దర్శనాల నగేశ్, నాయకులు నర్సింగ్, అశోక్ తదితరులు ఉన్నారు.

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా మంగళవారం ఘనంగా గోపాల కాల నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ జన్మ వృత్తాంతాన్ని వివరిస్తూ చేసిన ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. అనంతరం మఠాధిపతి యోగానంద సరస్వతి స్వామి భక్తులతో పుగుడి ఆడారు. అనంతరం వేడుకల్లో పాల్గొన్న ఎస్పీ గౌస్‌ఆలం శ్రీరాధాకృష్ణులను దర్శించుకున్నారు. అనంతరం చిన్నారులతో దహీ హండి నిర్వహించగా, భక్తులు ప్రసాదం కోసం పోటీపడ్డారు. మఠాధిపతి యోగానంద సరస్వతి స్వామి మాట్లాడుతూ ప్రతీ హిందువు ధర్మ పరిరక్షణకు పాటుపడాలని పిలుపునిచ్చారు. ఎస్పీ గౌస్ ఆలం మాట్లాడుతూ భగవద్గీతను బోధించిన శ్రీకృష్ణ పరమాత్ముని బోధనలు, విలువలను పాటించాలని పేర్కొన్నారు. వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్, ప్రమోద్ కుమార్ ఖత్రి, మాధవ్, దశరథ్ పటేల్, రాజేశ్వర్, దేవిదాస్, పవన్ పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం రాత్రి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుని ప్రతిమను ఊయలలో ఉంచి, ఊయల సేవ చేశారు.

బజార్‌హత్నూర్: మండల కేంద్రంతోపాటు దేగామ, గిర్నూర్, పిప్రి, టెంబి, మంజరంతండా, చందునాయక్‌తండా, యేసాపూర్, గోకొండ, బుర్కపల్లి గ్రామాల్లో మంగళవారం యాదవులు, మధుర కులస్తులు శ్రీకృష్ణ గోకులాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బజార్‌హత్నూర్‌లో యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించి, 10 వేల మందికి మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాల విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో ఉట్లు కొట్టారు. కార్యక్రమంలో పోతన్న, చంద్రశేఖర్, ధర్మన్న, శంకర్, రమణ, వినిల్, ఉత్తం, శంకర్, పాండురంగ్ పాల్గొన్నారు. జ



ఆదిలాబాద్: కార్యక్రమంలో ఎస్పీ, మఠాధిపతి

తలమడుగు: మండలంలోని సుంకిడి గ్రామంలోని శ్రీకృష్ణ దేవాలయంలో మంగళవారం ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఐదో వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గోక గణేశ్ రెడ్డి, మాజీ ఎంపీపీ లక్ష్మి రాజేశ్వర్‌లు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. వెంకన్న యాదవ్, మహేందర్ యాదవ్, పోచ్చన్న, రమేశ్, జ్ఞానేశ్వర్, దేవన్న, ప్రవీణ్ రెడ్డి, విలాస్ యాదవ్, ఆశన్న యాదవ్, దంజీ పటేల్, పోశెట్టి ఉన్నారు.

తాంసి: భీంపూర్ మండలంలోని అర్లి(టి) పాఠశాలలో మంగళవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు కృష్ణుడు, గోపిక వేషధారణలతో అలరించారు. విద్యార్థులు ఉట్టి కొట్టే కార్యక్రమంతో పాటు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రాజేశ్వర్, ఉపాధ్యాయురాలు ప్రతిమ, డ్యాన్స్ మాస్టర్ గడ్డం రవి తదితరులు పాల్గొన్నారు.

గుడిహత్నూర్: శ్రీకృష్ణ గోకులాష్టమి పండుగ పురస్కరించుకొని మండల కేంద్రంలో శివాజీ యూత్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీజే పాటలతో ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో పనిచేస్తున్న కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని రిమ్స్ సూపరింటెండెంట్ అశోక్‌కు కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఏఐటీయూసీ అనుబంధ సంస్థ తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి సిర్ర దేవేందర్ మాట్లాడుతూ రిమ్స్‌లో స్పార్క్ ఏజెన్సీ కాంట్రాక్టర్ గత ఐదు నెలలుగా ఏరియర్స్ ఇవ్వకుండా వెళ్లిపోయారన్నారు. సంఘం అధ్యక్షుడు చందు, బాధ్యులు ఖాసిమ్, రాథోడ్ రవీందర్, ఫయ్యాజ్ తదితరులు ఉన్నారు.

గంజాయి సాగు చేస్తే కఠిన చర్యలు

ఇంద్రవెల్లి: నిషేధిత గంజాయి సాగు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై దుబ్బక సునీల్ హెచ్చరించారు. ముందస్తు సమాచారం మేరకు మంగళవారం మండలంలోని సాలేగూడ గ్రామ శివారులో నైతం జ్యోతిరాం, నైతం మంతులు పత్తి చేలను పరిశీలించి అందులో నాటిన సుమారు 50 గంజాయి మొక్కలను గుర్తించి ధ్వంసం చేశారు. గంజాయి మొక్కలు నాటిన ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

బోథ్: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీఐ రమేశ్, ఎస్సై ప్రవీణ్‌లు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు.

ఎస్టీ హాస్టల్లో నీటి సమస్య

నార్నూర్: ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, ఎస్టీ వసతి గృహాలలో చదువుకుంటున్న విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పిస్తామని ప్రగల్భాలు పలుకుతున్న అధికారులు క్షేత్రస్థాయిలో మాత్రం కనీస సౌకర్యాలు కల్పించలేక విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. మండలంలోని భీంపూర్ ఎస్టీ బాయ్స్ హాస్టల్‌లో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. గత రెండు రోజులుగా వసతి గృహానికి నీటి సరఫరా లేకపోవడంతో విద్యార్థులు నీటి కోసం ఇబ్బంది పడుతున్నారు. కనీసం కాలకృత్యాలు తీర్చుకోవడానికి కూడా నీరు లేకపోవడంతో స్నానాలు కూడా చేయని పరిస్థితి వారిది. మంగళవారం ఉదయం చుక్క నీరు లేకపోవడంతో విద్యార్థులు టిఫిన్ కోసం ఉదయం 10 గంటల వరకు వేచి చూడాల్సి వచ్చింది. నీటి కోసం ఖాళీ ప్లేట్లు చేతిలో పట్టుకొని గంటల తరబడి కూర్చొని వేచి చూశారు. చివరికి 'సాక్షి' సమస్యను స్థానిక ఏటీడీవో క్రాంతి కుమార్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి విద్యార్థులకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.



నీరు లేకపోవడంతో టిఫిన్ తినకుండా వేచి చూస్తున్న విద్యార్థులు

ముగిసిన తీజ్ ఉత్సవాలు

ఇచ్చోడ: మండలంలో గత తొమ్మిది రోజులుగా జరుపుకుంటున్న తీజ్ ఉత్సవాలను మంగళవారం ఘనంగా ముగించారు. ముగింపు సందర్భంగా పెళ్లికాని యువతులు గోధుమతో విత్తిన బుట్టలను ఒకచోట పెట్టి నృత్యం చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనం చేశారు. మండలంలోని దాబా(కే)లో మహిళలు పెద్ద ఎత్తున వేడుకల్లో పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: శ్రావణమాసం పురస్కరించుకొని ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులు తీజ్ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం తీజ్ ముగింపు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. యువతులు తమ ఆరాధ్య దైవాన్ని ప్రార్థిస్తూ వేడుకలను నిర్వహించారు. సంబరాల్లో ఆటపాటలు అందరిని ఆకట్టుకున్నాయి. మండల కేంద్రంతో పాటు మండలంలోని పులిమడుగు, ఎక్స్‌రోడ్డు, లింగోజీతండా, హస్నాపూర్ తదితర గ్రామాల్లో ముగింపు ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. జగన్‌నాయక్, మేఘనాథ్ కారోబారి, భీముడు డాష్, మంగీలాల్ విజయ్‌కుమార్, సునీల్, సంజీవ్, శ్యాంరావు, శేషరావు, శంకర్, అబాజీ, దినేశ్, ప్రేం, వినోద్, రవి తదితరులు పాల్గొన్నారు.



ఉట్నూర్‌రూరల్: ఉత్సవాల్లో యువతులు

సంక్షిప్త వార్తలు

బీజేపీ సభ్యత్వ నమోదు వర్క్‌షాప్

నేరడిగొండ: బీజేపీ సభ్యత్వ నమోదు వర్క్‌షాప్ కార్యక్రమాన్ని బుధవారం ఉదయం 10 గంటలకు భూమారెడ్డి కాంప్లెక్స్‌లో నిర్వహించనున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు సాబ్లే సంతోష్ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఆదిలాబాద్: ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ మజ్దూర్ యూనియన్ డిపో సెక్రటరీ కిషన్ అన్నారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదిలాబాద్ డిపో ఎదుట మంగళవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉద్యోగులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ఆర్టీసీ విలీన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, నూతన బస్సులు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సిబ్బంది తక్కువగా ఉండడంతో భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు

సోనాలవాసికి అవార్డు

బోథ్: మండలంలోని సోనాల గ్రామానికి చెందిన భాశెట్టి రాజ్‌కుమార్‌కు స్వామి వివేకానంద జాతీయ అవార్డు 2024 లభించింది. రాజ్ కుమార్ పలు రంగాల్లో చేసిన సేవలను గుర్తించి బహుజన సాహిత్య అకాడమీ వారు అవార్డుకు ఎంపికచేశారు. అవార్డును సెప్టెంబర్ 5వ తేదీన తిరుపతిలో అందుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఉట్నూర్‌రూరల్: మండలంలోని కల్కారం గ్రామానికి చెందిన చంద్రయ్య ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మృతుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

బోథ్: మండల కేంద్రానికి చెందిన ఆనందపు రవితేజ మృతిచెందగా రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్, మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ లు మంగళవారం బాధిత కుటుంబాన్ని వేర్వేరుగా పరామర్శించారు.

ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలి

బోథ్: ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని ఎంపీడీవో జీవన్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ధన్నూర్ కె కుశలాపూర్, బిర్లాగొంది గ్రామాలను సందర్శించారు. పంచాయతీ సిబ్బందికి, కార్మికులకు తగు సూచనలు చేశారు.

కార్మికుల వేతనాలు చెల్లించాలని వినతి

కైలాస్‌నగర్: మున్సిపల్ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించేలా తగు చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వలభోజు గోపికృష్ణ అన్నారు. మంగళవారం పట్టణంలో ఆదిలాబాద్ రూరల్, అర్బన్ సంఘ బాధ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. అంతకుముందు ఎంఈవో సోమయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. రవి, జీజబాయి, గంగాధర్, గోపాలకృష్ణ, చంద్రశేఖర్, కేశవ్, గోపాల్, రాజేశ్, దేవిదాస్, రాజేశ్వర్, జంగు తదితరులు పాల్గొన్నారు.

రైతుల గుర్తింపునకు చర్యలు

కైలాస్‌నగర్: రైతు రుణమాఫీలో ఆహారభద్రత కార్డులేని రైతు కుటుంబాల గుర్తింపునకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయశాఖ అధికారి శ్రీధర్ స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం మండలాల వారీగా నోడల్ అధికారులను నియమించామన్నారు. షెడ్యూల్ ప్రకారం బుధవారం నుంచి వారు గ్రామాలను సందర్శించి రైతు వారీగా కుటుంబ సభ్యుల వివరాలను నిర్ధారిస్తారని పేర్కొన్నారు. రైతులు వివరాలను అందించి సహకరించాలని కోరారు.

నేడు కోనేరు ప్రతిష్ఠాపన

ఆదిలాబాద్‌రూరల్: మండలంలో గల బెల్లూరి అయ్యప్ప ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన కోనేరు ప్రతిష్టాపన మహోత్సవాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు సూర్యకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు.